ప్రజాశక్తి
సోమవారం 5 మే 2025
5
శ్రీ సత్యసాయి

విలేకరుల సమావేశంలో పాల్గొన్న సిపిఎం నాయకులు

జెసి ప్రభాకర్ రెడ్డి విమర్శలను ఖండించిన సిపిఎం

ప్రజాశక్తి - అనంతపురం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. రాంభూపాల్‌పై జె.సి. ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను సిపిఎం జిల్లా కమిటీ ఖండించింది. ఆదివారం స్థానికగణేనాయక్ భవన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు వి. రాంభూపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ. నల్లప్ప, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. బాల రంగయ్య మాట్లాడారు. గత వైసీపీ పాలనలో కార్మిక సమస్యలపై తాడిపత్రిలో సిపిఎం చేసిన చేసిన పోరాటాల్లో జేసీ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నది నిజం కాదా అని ప్రశ్నించారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ కి ఎదురొడ్డి తాడిపత్రి నియోజకవర్గంలో 8 ఎంపిటీసీలు, ఒక జెడ్ పి టీ సి, ఒక మున్సిపల్ కౌన్సిలర్ స్థానానికి సిపిఎం పోటీ చేసిందని గుర్తు చేశారు. అంతేకాకుండా గత పాలనలో తాడిపత్రి లో జరిగిన అన్ని తప్పుడు పద్ధతులను ఎప్పటికప్పుడు వ్యతిరేకించింది సిపిఎం అని చెప్పారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్ దంపతులకు ఒకటిన్నర సెంటు ఇల్లు, వెయ్యి రూపాయల బ్యాంకు అకౌంట్ తప్ప ఎలాంటి భూమి, డబ్బు లేదన్నారు. ఎవైనా ఎక్కడున్నా జేసీ ప్రభాకర్‌రెడ్డే వాటిని దానం చేయాలన్నారు. శనివారం ఓ టీవీ ఛానల్ చర్చలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. రాంభూపాల్ మాట్లాడిన అంశంపై జె.సి. ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అధికారంలో ఎవరున్నా ప్రజల తరపున పోరాడడం, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎదిరించడం సిపిఎం విధానమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప స్పష్టం చేశారు. గతంలో పెద్దారెడ్డి జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంటికి వచ్చి దౌర్జన్యం చేసినప్పుడు అందరికంటే ముందు విమర్శించింది అప్పటి సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ అనే విషయం గుర్తించాలన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ తరుపున కూడా ఆరోజు ఖండించడమే కాకుండా జిల్లాలోని వామపక్ష పార్టీలు కలిసి వైసీపీ ని విమర్శించాయని గుర్తు చేశారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపక్షాలను పోటీ చేయనీయకుండా వైసీపీ ప్రభుత్వం అడ్డుకుంటున్న సమయం లో తాడిపత్రి నియోజకవర్గం లో పెద్దవడుగూరు జెడ్ పి టి సి, తాడిపత్రి రూరల్, యాడికి, పెద్దవడుగూరు మండలాల్లో ఎనిమిది ఎంపిటీసీలకు సిపిఎం పోటీ చేసిందని గుర్తు చేశారు. తాడిపత్రి మున్సిపాల్టీ లో కౌన్సిలర్‌గా సిపిఎం తరుపున పోటీ చేసిన అభ్యర్థి భర్తను ఎన్ని రకాలుగా బెదిరించినా పోటీ నుండి తప్పుకోని విషయం జేసీ ప్రభాకర్‌రెడ్డికి తెలియదా అని ప్రశ్నించారు. మునిసిపాలిటీ, అంగన్వాడీ, ఆశ కార్మికులు చేసిన పోరాటాల్లో రాంభూపాల్ తో కలిసి జేసీ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్న విషయం తాడిపత్రి కార్మికులు, ప్రజలు మరచిపోలేదని అన్నారు.. వైసీపీ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరం మేడే సందర్భంగా తాడిపత్రి లో పెద్ద ప్రదర్శన చేస్తే జేసీ ప్రభాకర్‌రెడ్డి రాంభూపాల్ తో కలిసి పాల్గొన్నారని 'అప్పుడు మీతో మ్యాచ్ ఫిక్సింగ్ అయినట్లా?' అని ప్రశ్నించారు. ఫిక్సింగుల అలవాటు సిపిఎం కు వుండదని ఆధారాలుంటే బయట పెట్టాలని సవాల్ విసిరారు. ఏ పార్టీ అధికారంలో ఉన్న చట్టబద్ధంగా ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రజా సమస్యలు పరిష్కరించాలని, జిల్లా అభివృద్ధి కావాలని పోరాడటమే సిపిఎం విధానమని అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్ మాట్లాడుతూ తాము గతంలో ఏమి చేసామో మీకు గుర్తు లేకపోయినా ఈ సంవత్సరం జనవరి 1న తాడిపత్రిలో జేసీ ప్రభాకర్‌రెడ్డి నిర్వహించిన మహిళ కార్యక్రమం పై వారి మిత్రపక్షం బీజేపీ విమర్శించినప్పుడు వారి పార్టీ కంటే ముందుగా ఖండించింది తామేనని గుర్తు చేశారు. ఆ తర్వాత కొద్ది రోజులకు అనంతపురంలో జేసీ కుటుంబానికి చెందిన బస్సు తగులబడితే సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని జిల్లా పోలీసు అధికారులను కోరింది సిపిఎంగా తామేనని అన్నారు. ఎవరిపై వ్యక్తిగతంగా మాట్లాడే స్వభావం తమకు లేదన్నారు. తన ఆస్తుల వివరాలను బయటపెడతామని చెప్పడాన్ని స్వాగతిస్తున్నానని అన్నారు. తనతో పాటు, తన భార్య బ్యాంకు, ఆధార్ కార్డు వివరాలు పంపుతున్నానని, ప్రస్తుతం నివాసం వున్న ఒకటిన్నర సెంట్ ఇల్లు తప్ప తమ పేరుతో భూ మండలంలో ఎక్కడైనా ఎలాంటి ఆస్తి వున్నా, బ్యాంకులో వెయ్యి రూపాయల కు మించి డబ్బులు వున్నా వారికి ఇష్టం వచ్చిన వారికి దానం చేసుకోవచ్చని అన్నారు.

విద్యార్థులకు 'కార్పొరేట్' వల

- అడ్మిషన్ల వేట షురూ
- రాయితీల పేరుతో ఉక్కిరి బిక్కిరి చేస్తున్న విద్యా సంస్థలు
- తల్లిదండ్రులకు ఫోన్లు, ఎస్ఎంఎస్‌లు
- కళాశాలల్లో ఎన్నో ప్రత్యేకతలంటూ ప్రచారం

కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలు విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు వల వేస్తున్నాయి. గత నెల నుంచే ఎల్‌కెజి, నర్సరీ తరగతులకు అడ్మిషన్ల కోసం టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌లకు లక్ష్యాలను నిర్దేశించారు. దీంతో టీచర్లు ఇంటింటికీ తిరిగి అడ్మిషన్ల కోసం వెంట పడుతున్నారు. జూనియర్ కళాశాలల ప్రతినిధులు ఏకంగా గ్రామాల్లో మధ్యవర్తులను పెట్టుకుని, విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి కాలేజీల ప్రత్యేకతలను వివరిస్తున్నారు. ప్రభుత్వ, ప్రయివేటు,కార్పొరేట్ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రుల నెంబర్లు సేకరించి మొబైల్ ఫోన్లకు ఎస్ఎంఎస్‌లు, ఫోన్లు చేస్తూ ఊదరగొడుతున్నారు. ఎలాగోలా బుట్టలో వేసుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం గతంలో పదో తరగతి ఫలితాల అనంతరం అడ్మిషన్ల కోసం కార్పొరేట్, ప్రయివేటు విద్యా సంస్థలు తమ సిబ్బందికి లక్ష్యాలు విధించి అడ్మిషన్లు సేకరిస్తుంటాయి. ప్రస్తుతం భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. అడ్మిషన్ రిజర్వ్ చేసుకుంటే రాయితీలిస్తామని ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లు చెబుతున్నాయి. వివిధ కోర్సులను ప్యాకేజీగా రూపొందించి 20 నుంచి 40 శాతం వరకూ ఆఫర్ చేస్తున్నాయి. విద్యార్థుల స్థాయిని బట్టి అడ్మిషన్లు సేకరిస్తున్నాయి.

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 319 ఇంటర్ జూనియర్ కాలేజీలున్నాయి. ఇందులో శ్రీ సత్య సాయి జిల్లాలో ప్రభుత్వ, కెజిబివి, మోడల్ కళాశాలలు 70, ప్రయివేటు కళాశాలు 42 మొత్తం 112 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. రెండేళ్లుగా జూనియర్ ప్రభుత్వ కాలేజీలలో ఫలితాలు తలకిందులైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆర్థిక పరిపుష్టత లేకపోయినా పిల్లల భవిష్యత్తు కోసం అప్పులు చేసైనా మంచి కాలేజీలో చేర్పించాలని పిల్లల తల్లిదండ్రులు యోచిస్తున్నారు.. దీనిని క్యాష్ చేసుకునేందుకు కార్పొరేట్, ప్రయివేటు కాలేజీల నిర్వాహకులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. విద్యార్థులను ఎలాగైనా తమ కళాశాలలో చేర్చుకునేందుకు ఇంటింటా ఫోన్, ఎస్ఎంఎస్‌ల ద్వారా అప్పుడే ప్రచారం మొదలు పెట్టారు. బుట్టలో వేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. తమ కళాశాలలో ఉత్తమ బోధనతో పాటు ఫలానా ప్రత్యేకతలు ఉన్నాయని, చేరితే రాయితీలు ఇస్తామని ఊదరగొట్టేస్తున్నారు. విద్యార్థుల చిరునామా, ఫోన్ నెంబర్లను ప్రయివేటు సంస్థల ప్రతినిధులు.. ఆయా పాఠశాలల నుంచి ఇప్పటికే సేకరించారు. ఆ విద్యార్థి మార్కులు, కుటుంబ ఆర్థిక స్థోమతను తెలుసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రయివేటు విద్యాసంస్థల ప్రతినిధులు స్థానికంగా నియమించుకున్న మధ్యవర్తుల ద్వారా నేరుగా విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళుతున్నారు. తమ కళాశాలలో చేర్చితే ఫీజు రాయితీ ఇస్తామని, సౌకర్యాలు కల్పిస్తామని, పలు పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తామని, ఆలస్యం చేస్తే సీట్లు దొరకవని ఊదరగొడుతున్నారు. మరో వైపు ఉపాధ్యాయుల ద్వారా గాలం వేస్తున్నారు.

ఎవరి డప్పు వారిది..

హిందూపురం, అనంతపురంతో పాటు విజయవాడ, విశాఖపట్నం విద్యాసంస్థలు ప్రత్యేకంగా మధ్యవర్తులను నియమించుకుని, వారి ద్వారా ప్రచారం చేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా తమ సంస్థలు ఉన్నాయని, జిల్లాలోనే కళాశాల శాఖ ఉందని, అందులో చేరాలని ఒత్తిళ్లు తెస్తున్నారు. కార్పొరేట్ సంస్థలకు తామేమీ తక్కువ కాదని జిల్లాలోని పలు ప్రయివేటు కళాశాలలు కూడా విద్యార్థులపై వల వేస్తున్నాయి. ఈ ప్రచారంలో తమ కళాశాలలో ప్రత్యేకంగా ఎంసెట్, ఎఐఇఇఇ, జెఇఇ మెయిన్స్, ఎన్ఐటి శిక్షణ ఇస్తామని, పిల్లలకు బంగారు భవిష్యత్తు ఉంటుందని ఆశ చూపుతున్నారు.

కార్పొరేట్ల కోసం కార్మికులకు అన్యాయం

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు మేలు చేయడం కోసం లేబర్ కోడ్స్ పేరుతో కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తోందని, లేబర్‌కోడ్స్ రద్దుకు పోరాడుదామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ లేబర్ కోడ్స్ బిల్లులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న కేంద్ర కార్మిక సంఘాలు చేపట్టిన జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని ఓబులు పిలుపునిచ్చారు. ఆదివారం కదిరి సిఐటియు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చి కార్మికుల హక్కులను హరించిందన్నారు. కార్మికుల శ్రమను పెట్టుబడిదారులకు దోచిపెట్టడానికే ఈ చట్టాలను సవరించిందన్నారు. ఈ లేబర్ కోడ్స్ అమలయితే కార్మికులకు సంఘం పెట్టుకొనే హక్కు కూడా లేకుండా పోతుందన్నారు. ఒకవైపు దేశంలో నిరుద్యోగం, పేదరికం పెరిగి ప్రజల్లో కొనుగోలు శక్తి పడిపోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 20న చేపట్టిన సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు జి.ఎల్ నరసింహులు, సాంబశివ, జగన్, రామ్మోహన్, ముస్తాక్, బాబ్జాన్, ఉదయ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

హెలికాప్టర్ ఘటనలో 10 మంది అరెస్టు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సత్యసాయి జిల్లా పర్యటన సందర్భంగా హెలికాప్టర్ వద్ద చోటు చేసుకున్న అంశంపై అరెస్టుల పర్వం ప్రారంభమైంది. ఏప్రిల్ ఎనిమిదవ తేదీన సత్యసాయి జిల్లా రామగిరి మండలంలోని పాపిరెడ్డిపల్లి గ్రామంలో లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్ వచ్చారు. ఆ సందర్భంగా పెద్దఎత్తున వైసిపి శ్రేణులు హెలిప్యాడ్‌లోకి దూసుకొచ్చారు. ఈ సమయంలో హెలికాప్టర్ విండ్‌షీల్డ్ దెబ్బతింది. దీంతో వైఎస్.జగన్మోహన్‌రెడ్డి హెలికాప్టర్‌లో తీసుకెళ్లడానికి పైలెట్లు నిరాకరించడంతో ఆయన రోడ్డు మార్గంలో బెంగళూరుకు వెళ్లారు. భద్రతా వైఫల్యంతోనే ఇది జరిగిందని వైసిపి పెద్దఎత్తున ఆరోపణలు చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనపై విచారణకు ఆదేశించింది. నిర్వాహకులుగానున్న వైసిపి రాప్తాడు సమన్వయకర్త అయిన తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డితోపాటు, రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి, చెన్నేకొత్తపల్లి వైసిపి నాయకులపై కేసులు నమోదయ్యాయి. ఈ కేసులో పైలెట్లకు సైతం పోలీసులు నోటీసులిచ్చారు. కో పైలెట్ విచారణకు వెళ్లగా పైలెట్ మాత్రం ఇప్పటి వరకు హాజరవలేదు. ఇది నడుస్తున్న క్రమంలో రామగిరి సర్కిల్ పరిధిలోని పోలీసులు కేసులు నమోదైన పది మంది వైసిపి నాయకులను ఆదివారం తెల్లవారుజామున అరెస్టు చేశారు. రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కోసం గాలింపు చేపట్టారు.

అరెస్టు చూపించాలి : వైసిపి నాయకులు

వైసిపి నాయకులను అరెస్టు చేసిన విషయం తెలియగానే మాజీ మంత్రి, సత్యసాయి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ చెన్నేకొత్తపల్లి పోలీసు స్టేషన్ వద్దకు చేరుకున్నారు. అరెస్టు చేసిన తమ నేతలను 41 సిఆర్‌పిసి నోటీసు ఇచ్చి విడుదల చేయాలని డిమాండ్ చేశారు .ఈ నేపథ్యంలో అరెస్టు చేసిన వారిని శనివారం సాయంత్రం కోర్టులో హాజరుపరచగా వారికి న్యాయమూర్తి బెయిల్ ఇచ్చారు.

వైఎస్.జగన్మోహన్‌రెడ్డిపై కుట్ర పన్నారు : మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి భద్రత విషయంలో కుట్ర జరిగిందని మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన చెన్నేకొత్తపల్లిలో మీడియాతో మాట్లాడారు. పోలీసులు చంద్రబాబునాయుడు కబంధ హస్తాల్లో చిక్కుకున్నారని విమర్శించారు. తప్పుడు కేసులు పెట్టి వైసిపి నాయకులను ఇబ్బందులు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పుడు వారు పెట్టిన తప్పుడు కేసు ప్రకారమైన 41 సిఆర్‌పిసి నోటీసు ఇచ్చి బెయిల్ ఇవ్వవచ్చునన్నారు. అయితే అది చేయకుండా భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కోసం గాలింపు
కేసులతో కట్టడి చేయలేరు : వైసిపి

ముమ్మాటికి అది పోలీసు భద్రతా వైఫల్యమే : ఉషశ్రీ చరణ్

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాపిరెడ్డిపల్లి పర్యటనలో చోటు చేసుకున్న ఘటనల్లో ముమ్మాటికి పోలీసు భద్రతా వైఫల్యం ఉందని ఉషచరణ్ శ్రీ ఆరోపించారు. తగినంతగా భద్రతా చర్యలు తీసుకోకపోవడం వలన హెలికాప్టర్ విండ్ షీల్డ్ దెబ్బతిందన్నారు. దాన్ని కప్పిపుచ్చుకోవడంలో భాగంగా వైసిపి శ్రేణులపై కేసులు పెట్టి భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇటువంటి కేసులకు భయపడబోమని చెప్పారు. మరింత గట్టిగా పనిచేస్తారని చెప్పారు. ఎల్లకాలం కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉండదని అన్నారు. తమ ప్రభుత్వం కూడా వస్తుందని తెలిపారు. తాము వారిలాగా రెడ్‌బుక్‌లు ఉండవని గుడ్‌బుక్ లే తమ వద్ద ఉంటాయని చెప్పారు.

పద్మభూషణుడికి ఘనంగా పౌర సన్మానం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం శాసనసభ్యులు, సినీ హీరో నందమూరి బాలకృష్ణ కు కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డుతో సత్కరించిన నేపథ్యంలో ఆదివారం రాత్రి బాలకృష్ణకు పట్టణంలోని ఎంజీఎం పాఠశాల మైదానంలో ఘనంగా పౌర సత్కార సన్మాన కార్యక్రమం జరిగింది. దీనికన్నా ముందు శ్రీకంఠాపురం నుంచి సభా వేదిక వరకు నందమూరి బాలకృష్ణ తన సతీమణి వసుంధర దేవి లు గుర్రపు బండిలో ఊరేగింపుగా సభా ప్రాంగణానికి చేరుకొన్నారు. ఈ సందర్భంగా పుర ప్రజలు బాలయ్య దంపతులకు పూల వర్షాన్ని కురిపించారు. సభ ప్రాంగణానికి వచ్చిన బాలయ్యకు మంత్రి సవితమ్మతో పాటు ఎంపీ పార్థసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎమ్మెల్యేలు, ప్రముఖులు సన్మానించారు. అనంతరం మంత్రి సవితమ్మ, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, హిందూపురం ఎంపీ పార్థసారథి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, కదిరి ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, పరిటాల సునీత మాట్లాడారు. హిందూపురం నియోజకవర్గాన్ని నందమూరి నియోజకవర్గంగా తీర్చిదిద్ది, నందమూరి పురంగా మార్చిన ఘనత బాలకృష్ణ కే దక్కుతుంది అన్నారు. సినీరంగంలో, రాజకీయ రంగంలో తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ, ఎన్నో సేవా కార్యక్రమాలను నందమూరి బాలకృష్ణ చేపట్టారన్నారు. అటు సినీ రంగంలో... ఇటు రాజకీయ రంగంలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ తన తల్లి పేరుతో స్థాపించిన బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ ఆసుపత్రి చైర్మన్ గా ఉంటూ ఎంతోమందికి ప్రాణదానాన్ని బాలకృష్ణ చేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి బాలకృష్ణ డైలాగులతో అదరగొట్టారు. అనంతరం వేలాదిమంది అభిమానుల నడుమ పద్మభూషణుడు నందమూరి బాలకృష్ణ దంపతులకు హిందూపురం పట్టణం తరపున సీనియర్ నాయకులు గ్రీన్ పార్క్ నాగరాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ అనిల్ కుమార్, లేపాక్షి మండలం తరపున రంగారెడ్డి తదితరులు, హిందూపురం మున్సిపల్ కౌన్సిలర్లు, లేపాక్షి మండల నాయకులు, నందమూరి అభిమానుల సంఘం నాయకులు, టిడిపి నాయకులు, తెలుగు యువత నాయకులు, జనసేన, బిజెపి నాయకులు జ్ఞాపికలను అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు వివిధ కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజనప్ప, టిడిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, హిందూపురం మున్సిపల్ చైర్మన్ డి రమేష్ కుమార్, పెద్ద ఎత్తున టిడిపి నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, వేలాదిమంది అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

హాజరైన మంత్రి సవిత, ఎంపీ, ఎమ్మెల్యేలు
బాలయ్య డైలాగులతో అదరగొట్టిన మాజీ మంత్రి పల్లె

గుర్రపుబండిపై సతీ సమేతంగా సన్మాన ప్రాంగణానికి వస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ



బాలకృష్ణకు జ్ఞాపికను అందజేస్తున్న నాయకులు

పాడి రైతులకు ప్రోత్సాహం

జిల్లా పశు సంవర్ధక శాఖ ఏడీ శుభదాసు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్



జిల్లా పశు సంవర్ధక శాఖ ఏడీ శుభదాసు

పాడి రైతులను ఆదుకోవడం కోసం ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తుందని దాంతో పాడి పరిశ్రమ అభివృద్ధి చెందుతోందని శ్రీ సత్య సాయి జిల్లా పశు సంవర్ధక శాఖ ఏడీ శుభదాసు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : పాడి రైతులకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాలు ఏవీ?

జవాబు: పాడి రైతులను ఆదుకోవడం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలను ప్రవేశపెట్టింది. వాటిలో ముఖ్యంగా నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో గొర్రెల పెంపకం, నాటు కోళ్ల పెంపకం ద్వారా రైతులకు సబ్సిడీ రుణాలను అందజేసి ఆదుకుంటోంది. 500 గొర్రెల పెంపకం చేస్తే కోటి రూపాయలు రుణం మంజూరు చేస్తాం. అందులో 50 శాతం సబ్సిడీతో బ్యాంకుల ద్వారా రుణం పొందవచ్చు, ఇదివరకు శ్రీ సత్య సాయి జిల్లాలో కోటి రూపాయల రుణాలను ఐదు యూనిట్లకు మంజూరు చేశాం. రూ.30 లక్షల విలువ జేసే ఎనిమిది యూనిట్లు మంజూరు చేశాం.

ప్ర : పాడి రైతులకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాలు తెలపండి.

జ: ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు పశుగ్రాసం పెంపకానికి ఎకరాకు రూ. 33 వేల రూపాయలు అందజేస్తుంది. ఇప్పటిదాకా జిల్లాలో 12 వేల ఎకరాలు పశుగ్రాసం పెంపకం జరుగుతోంది. మరింత మంది రైతులు ముందుకు వస్తే వారికి కూడా అవకాశం కల్పిస్తాం. శైలేజి పాతర గడ్డి పెంపకంపై దృష్టి పెడుతున్నాం. ఈ గడ్డిలో ఉండే అధిక పోషకాలు పాడి పశువులు ఎక్కువ పాల ఉత్పత్తిని అందించడమే కాక ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి.

ప్ర : పాడి పశువుల సంతానోత్పత్తి. అధిక పాలు దిగుబడి కి చేస్తున్న తీసుకుంటున్న చర్యలు ?

జ : ఉమ్మడి అనంతపురం జిల్లాలో రైతులు తీవ్ర కరువు బారిన పడినందున ఆడ లేగ దూడలు మాత్రమే పుట్టే విధంగా శమన అనే కార్యక్రమం చేపట్టాం. దీని ద్వారా సంతాన ఉత్పత్తిలో ఆడ దూడలు మాత్రమే జన్మించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. శ్రీ సత్య సాయి జిల్లాలో ఉచితంగా 6 వేలు డోసులు అందించనున్నాం. ఇవి ఇదివరకే కదిరి, నల్ల చెరువు ,తనకల్లు ,తలుపుల మండలాల్లో అందుబాటులో ఉన్నాయి. వీటిని ఇతర జిల్లాలలో ఒక్కొక్కటి 500 రూపాయలు చెల్లించి వేయించుకోవాల్సి ఉందని కానీ సత్యసాయి జిల్లాలో ఉచితంగా అందిస్తున్నాం. సంతాన ఉత్పత్తి ఇంజక్షన్ ద్వారా కచ్చితంగా పెయ్యదూడలే జన్మిస్తాయి. దానివలన జిల్లా వ్యాప్తంగా పాడి పశువుల అభివృద్ధి ఊపందు కుంటుంది.

ప్ర : పాడి రైతుల కొరకు చేస్తున్న కార్యక్రమాలు.

జ: శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా అధిక పాల దిగుబడి సాధించడం కోసం పాడి రైతులకు అతి తక్కువ ధరతో పోషకాలతో ఉన్న దానాను అందజేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా పది లారీలు దానా ను రైతులు అందించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. 32 మండలాల్లో ఒక్కో మండలానికి 250 మెట్రిక్ టన్నులు సరఫరా చేస్తాం. ధర్మవరం డివిజన్లో తొమ్మిది మండలాలకు 75 మెట్రిక్ టన్నులు. పెనుగొండ 12 మండలాలకు 10 మెట్రిక్ టన్నులు, హిందూపురం 11 మండలాలకు 75 మెట్రిక్ టన్నులు అలాట్‌మెంట్ చేశాం. త్వరలో దాణా రానుంది. సబ్సిడీ పోను కేజీ ఐదురూపాయల యాభైఐదు పైసలు రైతులు చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో రైతుకు 50 కేజీల బస్తా 555రూపాయలకు అందజేయనున్నాము. దీనిని రైతన్నలు సద్వినియోగం చేసుకోవాలి.

6 నుంచి సంగమేశ్వరుని బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి కొత్తచెరువు

కొత్తచెరువులో ప్రతి ఏడాది నిర్వహించే సంగమేశ్వరుని బ్రహ్మోత్సవాలు ఈనెల ఆరవ తేదీ నుండి 14వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ ధర్మకర్త నటరాజు తెలిపారు. ఒక్కొక్క రోజు ఒక్కొక్క వాహన సేవ ఉంటుందన్నారు. ఆరవ తేదీ ధ్వజారోహణ స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 7న తేదీ హంస వాహనం, 8న బృంగివాహనం, 9న శేష వాహనం, 10న నంది వాహనం, 11న రాత్రి పార్వతి పరమేశ్వరులకు కళ్యాణోత్సవం, 12వ తేదీ ఉదయం 11 గంటలకు రథోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. 13న పార్వేటోత్సవం, 14న వసంతోత్సవంతో ఈ బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు.

ప్రతిభా పురస్కారానికి దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - కొత్తచెరువు

ఉమ్మడి జిల్లాలో ఎస్సీ ఎస్టీ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రతిభా పురస్కారానికి దరఖాస్తు చేసుకోవాలని ఏపీ ఎస్‌సి, ఎస్‌టి డబ్ల్యూ ఏ అధ్యక్షులు కటిక జయరాం తెలిపారు. 600 మార్కులకు గాను 540 మార్కులకు పైన సాధించిన విద్యార్థులు ఈనెల 8వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్: 9440705369, 9491663388కు సంప్రదించాలని సూచించారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు వేంకటేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..వేసవి కాలంలో ప్రయాణికులకు ప్రజలకు దాహం తీర్చాలని మంత్రి సవిత ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మునిమడుగు వెంకటరాముడు, టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షులు శ్రీరాములు, మండల కన్వీనర్ సిద్దయ్య, రాంపురం సర్పంచి శ్రీనివాసులు మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, మాజీ సర్పంచి అశ్వర్థప్ప, టైలర్ ఆంజనేయులు, పాలడుగు చంద్ర, త్రివేంద్ర, బాబుల్ రెడ్డి, సాయి ప్రసాద్, రామలింగ, మావటూర్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి శస్త్ర చికిత్సలకు 41 మంది ఎంపిక

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ఆదివారం ధర్మవరంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి పరీక్షల శిబిరంలో 41 మందిని ఉచిత కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినటుల నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరాన్ని బెంగళూరువెస్ట్ లయన్స్ హాస్పిటల్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ (నేత్ర జ్యోతి హాస్పిటల్) డాక్టర్ అనురూప్, వైద్య సిబ్బంది, యువర్స్ ఫౌండేషన్ జిల్లా అందత్వ నివారణ సంస్థ సంయుక్తంగా నిర్వహించింది. కందికేరీ బసమ్మ,కందుకేరి సోమశేఖర్ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యుల సౌజన్యంతో ఉచిత నేత్ర చికిత్స పరీక్షలకు 98 మంది హాజరు కాగా 41 మంది కి కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ నాగేంద్ర, సెక్రటరీ జయరాం, ట్రెజరర్ వంకదారి మోహన్, డాక్టర్. సుబ్బారావు, క్యాంపు చైర్మన్ కళ్యాణ్ చక్రవర్తి, చాంద్‌బాషా, సికె. రామాంజి, జయంతి. వినోద్ కుమార్, ఆప్తలమిక్ ఆఫీసర్ సికిందర్, సి.కే రామాంజనేయులు నామాల శ్రీనివాసులు, కేతా లోకేష్, పెంజూరు నాగరాజ్ , రేణిగుంట్ల నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి గాండ్లపెంట

మండల కేంద్రానికి చెందిన పాములూరి మారుతి ప్రసాద్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుక్ను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదివారం మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉండగా ఒక్కొక్కరికి రూ. 50వేల చొప్పున లక్ష రూపాయలు వారి ఖాతాలో జమ చేస్తామన్నారు. పిల్లల చదువుల కోసం తమవంతు సాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ సి కొండయ్య, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు ఏ వెంకటరమణారెడ్డి, సర్పంచులు ఎస్ రహమతుల్లా, శివప్ప నాయుడు, వాల్మీకి రాష్ట్ర జాయింట్ సెక్రటరీ డి ఆనంద్, ఎస్.అక్రమ భాషా తదితరులు పాల్గొన్నారు

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - గాండ్లపెంట

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999. 2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు బాబురావు, లక్ష్మీనరసయ్య, కృష్ణమూర్తి, ఆదినారాయణ రెడ్డి, అస్లాం తదితరులను సన్మానించారు. దాదాపు 25 సంవత్సరాల కిందట చదివిన విద్యార్థులు ఒక చోటికి చేరి అప్పటి, ఇప్పటి వివరాలను నెమరు వేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయుడు సిద్ధారెడ్డి పామిడి ముంతాజ్ ఆలీ విశ్వనాథరెడ్డి ఓబుల్ రెడ్డి పాపారాయుడు తదితరులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రెడ్డి నాయక్ ప్రసాద్ ఇమ్రాన్‌తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి : మండల పరిధిలోగల పిన్నదరి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2000 – 04 వరకు చదివిన విద్యార్థిని విద్యార్థులు ఆదివారం గెట్ టుగెదర్ కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు ఈ కార్యక్రమంలో తమతోటి విద్యార్థిని విద్యార్థులు క్షేమ సమాచారాలు సుఖసంతోషాలు సాధక బాధలను అడిగి తెలుసుకున్నారు అప్పటి తమ హెడ్మాస్టర్ దివాకర్ రెడ్డి నారపరెడ్డి ఉపాధ్యాయులు సురేష్ నాగరాజు రాధాకష్ణ వసంత లక్ష్మి పరిహాసను పూర్వ విద్యార్థులు సన్మానించారు.

మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి : ఎపి రైతుసంఘం

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

జిల్లాలో రెండు రోజుల క్రితం గాలి వాన సృష్టించిన నష్టానికి రైతులకు పరిహారం చెల్లించాలని ఎపి రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ధర్మవరం రైతు సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న, పెనుగొండ హరి మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లా లో ఈసారి మామిడి దిగుబడి అంతత మాత్రమే ఉందన్నారు. ఈ ఇలాంటి పరిస్థితుల్లో పంట చేతికి వచ్చే సమయానికి శు క్రవారం రాత్రి కురిసిన గాలి వానకు మామిడి కాయాలు నేల రాలడంతో రైతులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. అదేవిధంగా రైతులు మందులకు ఇతర ఖర్చులకు లక్షలాది రూపాయలు ఖర్చు అయిందని, ఇటువంటి పరిస్థితిలో కూలి ఖర్చులు కూడ వచ్చే అవకాశం లేదని రైతులు వాపోతున్నారన్నారు. వెంటనే ఉద్యానవన అధికారులు జిల్లా వ్యాప్తంగా పంట నష్టాన్ని అంచనా వేసి మామిడి తోట రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ఆలకుంట మారుతీ, సీనియర్ నాయకులు ఎస్‌హెచ్. బాషా, జెవి రమణ తదితరులు పాల్గొన్నారు.

‘పురం’ లో ఉద్రిక్తత...

పార్టీ స్తూపాన్ని తొలగించడంపై వైసీపీ నేతలు నిరసన
అధికారుల హామీతో ఆందోళన విరమణ

రహమత్ పురం సర్కిల్ లో ధర్నా చేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

సినీ నటుడు, హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ పర్యటన సందర్భంగా ఆదివారం హిందూపురంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. వైఎస్ఆర్ స్తూపం తొలగింపు పై ఆ పార్టీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ రహమత్ పురం సర్కిల్లో ఆందోళన చేపట్టారు. పోలీసులు అడ్డుకోవడానికి ప్రయత్నించడంతో ఇరువురి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణకు కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డు ఇచ్చిన ఈ నేపథ్యంలో టిడిపి నాయకులు బాలకృష్ణను ఎంజీఎం మైదానంలో ఘనంగా పౌర సన్మానం చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా రహమత్ పూర్ సర్కిల్‌లో వైఎస్ఆర్ అమర్ రహే స్తూపాన్ని అధికారులు, టీడీపీ కార్యకర్తలు కలిసి తొలగించారు. అక్కడ బాలకృష్ణ ఫ్లెక్సీలను టిడిపి నేతలు పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేశారు. దీంతో స్తూపం తొలగింపు పై పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ పార్టీ కార్యాలయం నుంచి పెద్ద ఎత్తున ర్యాలీగా వెళ్లి రహమత్ పురం సర్కిల్ లో బైఠాయించి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆందోళన చేస్తున్న నాయకులను, కార్యకర్తలను అడ్డుకున్నారు. దీంతో వారి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు వేణు రెడ్డి మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్న టిడిపి శాసనసభ్యులు హిందూపురంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించలేకపోయారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ. 650 కోట్లతో పిఎబిఆర్ నుంచి శ్రీ రామిరెడ్డి నీటి పథకం ద్వారా హిందూపురానికి నీటిని తీసుకురావడం జరిగిందన్నారు. దీనికి గుర్తుగా నాడు వైఎస్సార్ స్థూపాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆ స్థూపాన్ని రాత్రికి రాత్రే అడ్డగోలుగా టిడిపి నాయకులు, అధికారులు కలిసి తొలగించారన్నారు. వైసిపి అధికారంలో ఉన్న సమయంలో రహమత్ పురం సర్కిల్ నుండి మార్కెట్ యార్డ్ వరకు ఎల్ఈడి విద్యుత్ దీపాలను ఏర్పాటుకు నిధులను మంజూరు చేయడం జరిగింది. అమర్చడానికి ఆలస్యం కావడంతో ఇప్పుడు వాటిని అమర్చారన్నారు. నెల రోజుల కిందటే ఈ పనులు పూర్తి అయినప్పటికీ బాలయ్య మెప్పుకోసం అధికారులు అక్కడ అమర్చిన విద్యుత్ దీపాలను వెలిగించలేదన్నారు. సన్మానం కోసం వస్తున్న బాలయ్యతో స్విచ్ ఆన్ చేయించాలని అక్కడ ఏర్పాటు చేసిన స్థూపాన్ని తొలగించడం ఎంతవరకు న్యాయమన్నారు. బాలకృష్ణ గడిచిన 10 సంవత్సరాల్లో హిందూపురం నియోజకవర్గాన్ని ఏమి అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు అందుబాటులో లేకుండా పాలనను పీఏలే చేతికి అప్పగించి సినిమాలకు పరిమితమయ్యారని ఆరోపించారు. బాలకృష్ణకు పద్మభూషణ్ రావడం పై తాము కూడా సంతోషిస్తున్నామని, పార్టీ తరపున అభినందనలు తెలుపుతున్నామని అన్నారు. అయితే అభివృద్ధిని విస్మరించి, ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వైసిపి కార్యకర్తలపైకవ్వింపు చర్యలకు పాల్పడడం సరికాదన్నారు. వెంటనే తొలగించిన స్థూపాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు తాము ఆందోళన విరమించే ప్రసక్తే లేదని వారు చెప్పారు. దీంతో కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. చివరకు మున్సిపల్ కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో, మున్సిపల్ అధికారులు అక్కడికి వచ్చి కార్యక్రమం పూర్తి కాగానే స్థూపాన్ని యధావిధిగా ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్మ బలరామిరెడ్డి, జబివుల్లా, కౌన్సిలర్లు శివ, ఆసిఫ్, మల్లికార్జున, దాదు, మహేష్ గౌడ్, వైసిపి నాయకులు రాము, రామకృష్ణ, మనోజ్ తో పాటు పెద్ద సంఖ్యలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిప్పుసుల్తాన్ వర్థంతి

ప్రజాశక్తి-హిందూపురం

టిప్పు సుల్తాన్ కు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

మాతృభూమి కోసం రక్తం చిందించిన అమర వీరుడు షహీద్ టిప్పు సుల్తాన్ అని వక్తలు అన్నారు. స్వాతంత్ర్య సమర యోధుడు టిప్పు సుల్తాన్ షహీద్ వర్ధంతినిఆదివారం పట్టణంలోని ఆజాద్ నగర్ సర్కిల్ లో హిందూ, ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో ముస్లిం నగారా, అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్ ఖాన్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షహీద్ టిప్పు సుల్తాన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉమర్ ఫారూఖ్ ఖాన్, ఎరుకల హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎరుకల శంకర్, తూముకుంట పారిశ్రామిక వావడ కార్మిక సంఘం అధ్యక్షుడు రవి, బహుజన సమాజ్ పార్టీ నాయకులు హరి, మాజీ ముతవల్లీ కలీమ్, వైసిపి నాయకులు అమానుల్లా, కాంగ్రెస్ నాయకులు జమీల్ మాట్లాడుతూ టిప్పు సుల్తాన్ దేశం కోసం చేసిన సేవలు చిరస్మరణీయమన్నారుఏ. మత సామరస్యం, పరమత సహనం సోదర భావానికి ప్రతీక గా వసుదైక కుటుంబ నిర్మాణానికి జీవితం అంకితం చేసిన త్యాగధనుడని పేర్కొన్నారు. మహనీయుని వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిప్పు సుల్తాన్ రక్త దాన సంఘం షేక్ షబ్బీర్, అతీఖురహమాన్, .ఆర్బాజ్, అబ్దురహమాన్, టైలర్ యూనియన్ జబీ, కాంగ్రెస్ నాయకులు ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తామని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు తెలిపారు. ఆదివారం సత్యసాయి మహాసమాధి దర్శనార్థం ఆయన ప్రశాంతి నిలయానికి వచ్చారు. దర్శనం అనంతరం ఉపాధ్యాయ సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు సత్యసాయి చిత్రపటాన్ని బహుకరించారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయా సంఘాల నాయకులు ఎమ్మెల్సీ దృష్టికి తెచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ఐఆర్‌తో పాటు పిఆర్‌సి కమిటీ వేసి పరిష్కరించాలని కోరామన్నారు. ప్రభుత్వం వివిధ రకాల ప్రణాళికను సిద్ధం చేస్తుందన్నారు. డిఎస్‌సి రిక్రూట్మెంట్ నందు పరీక్ష పేపర్లు జిల్లాల వారీగా కాకుండా రాష్ట్రమంతటా ఒకటే పరీక్ష పేపర్ ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. 117 జీవోను రద్దు చేసి తరగతి గదిలో 40 మంది మాత్రమే విద్యార్థులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో గ్రేడ్ వన్ ప్రధానోపాధ్యాయులను నియమించాలని స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించాలని, పదవి విరమణ 62 ఏళ్లకు పెంచాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు తన దృష్టికి తెచ్చిన సమస్యలన్నిటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తాననినాయకులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌టిఎ జిల్లా అధ్యక్షులు పివి రమణారెడ్డి, ఏపీపీయూఎస్ జిల్లా అధ్యక్షులు నరేష్ బాబు. పిఆర్‌టియు నాయకులు రామకృష్ణారెడ్డి, దామోదర్ రెడ్డి, రామాంజనేయులు, సౌదామని, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

బహుజన చైతన్య వేదిక రాష్ట్ర,జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటు

ప్రజాశక్తి-పెనుకొండ

బహుజన చైతన్య వేదిక రాష్ట్ర, జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలోని మార్కెట్ యార్డు లో హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ ఆధ్వర్యంలో బహుజన చైతన్య వేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బహుజన చైతన్య వేదిక రాష్ట్ర జిల్లాల కార్యవర్గాలను ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా హెచ్. శివరామకృష్ణ, ఉపాధ్యక్షులుగా రంగేపల్లి నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా రవి కుమార్, కార్యదర్శిగా భూతరాజు, రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా రొద్దం బాబు ప్రసాద్, రాష్ట్ర గౌరవ సలహాదారులు హనుమంతప్ప, రామాంజినప్ప, పీ సూర్యనారాయణ, మునిమడుగు నరసింహప్ప,రాష్ట్ర కోఆర్డినేటర్‌గా యం.ఆనంద్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నాగార్జున, ట్రెజరర్‌గా రామాంజినప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా రాయలసీమ ఇంచార్జిగా వై హెచ్ అంజినప్ప, రీజినల్ కోఆర్డినేటర్‌గా మంజునాథ, సెక్రటరీగా సురేష్. రీజినల్ జాయింట్ సెక్రటరీగా అగళి లోకేష్‌ను ఎన్నుకున్నారు. ఇక ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షులుగా ఈశ్వర్,ఉపాధ్యక్షులుగా కొల్లప్ప, గౌరవ అధ్యక్షులుగా కదిరప్ప, గంగాధరప్ప, కెంచప్ప, జిల్లాకోఆర్డినేటర్‌గా నరేష్ ,జిల్లా యువజన అధ్యక్షులుగా పెనుకొండ శశికుమార్, పవన్ కుమార్, జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్‌గా రామదాస్. జిల్లా వర్కింగ్ ప్రెసిసిడెంట్లుగా మూర్తి, తిరుపతయ్య, జిల్లా యూత్ జనరల్ సెక్రటరీగా కుమార్, జిల్లా యూత్ సెక్రటరీగా రామాంజిని ఎన్నుకున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - కదిరి టౌన్

విరాళం అందజేస్తున్న బత్తల హరిప్రసాద్

కదిరిలో చేపట్టిన సేవాలాల్ మహారాజ్ దేవాలయ నిర్మాణం కోసం వైసిపి బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ హరిప్రసాద్ విరాళం అందజేశారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారంకమిటీ సభ్యులకు లక్ష రూపాయలు అందచేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం కదిరి ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా బంజారాహిల్స్ నందు నూతనంగా నిర్మిస్తున్న శ్రీ మారెమ్మ , సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ దేవస్థానం పనులను ఆలయ సభ్యులతో కలిసి ఆయన పరిశీలించారు. నిర్మాణం పనులను పరిశీలించి ప్రత్యేక పూజలో పాల్గొని లక్ష రూపాయల నగదును దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జడ్పీటీసీ కృష్ణానాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్ నాయక్, సర్పంచి రవి నాయక్, ఎల్ఐసి వీరేనాయక్, శ్రీనివాసులు, కాంట్రాక్టర్ బాబా , చికెన్ జాకీర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే మురుగు

ప్రజాశక్తి - నల్లమాడ

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

మండల కేంద్రంలో ఎస్సీ కాలనీలో రోడ్డుపైనే మురుగునీరు ప్రవహిస్తోంది. డ్రయినేజీ చెత్తతో పూడుకుపోవటంతో మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో పాదాచారులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపైఐ మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెంది కాలనీవాసులు అనారోగ్యం పాలవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పారిశుద్య చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం మణేసముద్రం సమీపంలో ఉన్న ఏ 1 స్టీల్ పరిశ్రమ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ప్రమాదానికి సంబందించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు హిందూపురం నుంచి పెనుకొండ వైపు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంలో వెళుతున్న సోమందేపల్లి మండలానికి చెందిన భాస్కర్ అక్కడికక్కడే మృతి చెందాడు, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 సహాయంతో హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

హెలికాప్టర్ కేసులో 10 మంది అరెస్టు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

గత నెలలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రామగిరి మండలం పాపిరెడ్డి పల్లి గ్రామానికి వచ్చిన సందర్భంగా హెలికాప్టర్ విండ్ షీల్డ్ ధ్వంసం కేసులో 11 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు.వీరిలో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మినహా మిగతా పదిమంది నిందితులను చెన్నేకొత్తపల్లి పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వారిని ధర్మవరంలో సీనియర్ సివిల్ జడ్జి ముందు హాజరు పరిచారు. అనంతరం నిందితులకు జడ్జి బెయిల్ మంజూరు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పావగడ

కారు బైక్‌ను ఢీ కొనడంతో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అక్కడికక్కడే మతి చెందిన ఘటన పావగడ తాలూకాలోని నాగలమడిక హొబ్లీ అప్పాజీహళ్లి గ్రామ సమీపంలో జరిగింది. ఉప్పరహళ్లి తండాకు చెందిన ఆనందనాయక్(45) ద్విచక్రవాహనంలో వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆనందనాయక్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తిరుమణి పోలీసులు తెలిపారు.

చెట్టును ఢీకొన్న లారీ

హోంగార్డుతో సహా ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని పెనుగొండ పావగడ ప్రధాన రహదారిలో తురకాలపట్నం గ్రామంలో ఆదివారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. పావగడ వైపు నుంచి పెనుగొండ వైపు వెళ్తున్న లారీ తురకాలపట్నం గ్రామంలో చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌కకు కాళ్లు విరిగాయి. వారితో పాటు పెనుగొండ వైపు అందులోనే వెళుతున్న రొద్దం పోలీస్ స్టేషన్ నందు పనిచేస్తున్న హోంగార్డ్ రొద్దం బాలాజీ కీ తలకు గాయాలయ్యాయి. చేయి విరిగింది. ముగ్గురిని పెనుగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థినికి గాయాలు

ప్రజాశక్తి కొత్తచెరువు

కొత్తచెరువులోని పుట్టపర్తి రోడ్డు కనకదాసు విగ్రహం వద్ద మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థినికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు బాధితులు తెలిపిన వివరాల మేరకు పుట్టపర్తి సాయి నగర్ కు చెందిన చింతామాను సాయి వర్షిని ఆదివారం ఆర్టీసీ బస్సులో అనంతపురం వెళుతోంది. స్థానిక కనకదాసు విగ్రహం వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని బస్సు డ్రైవర్ తప్పించిపోయి విగ్రహానికి సమీపాన వేగంగా వచ్చాడు. ఈ సమయంలో వర్షినిబస్సు వెలుపల కుడి చేయి పెట్టడంతో విగ్రహానికి చేయి తగిలింది. దీంతో చేతికి తీవ్ర గాయమైంది. ఈ విద్యార్థిని శ్రీ సత్య సాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ అనంతపురం క్యాంపస్‌లో బీఏ హానర్ ఎకానమిక్స్ చదువుతోంది. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు అనంతపురంలో ఎన్‌పిటిఎల్ పరీక్ష రాయాల్సిన వర్షిని రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో పరీక్ష రాయలేకపోయింది. గాయపడిన వర్షినినిచికిత్స నిమిత్తం పుట్టపర్తికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తచెరువు పోలీసులు తెలిపారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ మల్లిఖార్జునరెడ్డి సూచించారు. ఆదివారం జిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. అందులో భాగంగా వాహనాల తనిఖీలు, ఫుట్ పెట్రోలింగ్ చేపట్టారు. రోడ్లపై మహిళల పట్ల ఎవరైనా యూటీజింగ్ చేసేవారిపై ప్రత్యేక దష్టిసారించారు .ప్రధానంగా రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక భగీరథ సర్కిల్‌లో ఉప్పర సగర సామాజికవర్గం ఆధ్వర్యంలో ఆదివారం భగీరథ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి సవిత భర్త వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. భగీరథ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి వెంకటరాముడు, టిడిపి నాయకులు సిద్ధి లింగప్ప, పవన్ కన్వీనర్ వడ్డే సూరి, రాష్ట్ర వాల్మీకి డైరెక్టర్ డివి ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ ఉప్పర బాబయ్య లోకేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పావగడ : పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఆదివారం భగీరథ మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ వరదరాజులు భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి రాజగోపాల్, ఉప్పర సమాజ నాయకులు పాల్గొన్నారు.

హిందూపురం : భగీరథ మహర్షి జయంతి సందర్భంగా ఆదివారంపట్టణంలోని ఆటో నగర్ సర్కిల్ లో భగిరథ మహర్షి విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ పీఏ వీరయ్యతో పాటు మున్సిపల్ చైర్మేన్ రమేష్ కుమార్, టిడిపి జిల్లా అద్యక్షులు అంజినప్ప, టీడీపీ నాయకులు వెంకట నారాయణ, కదిరప్ప, రామప్ప, శ్రీరామప్ప, అంజినప్ప, బసప్ప, అశ్వర్థప్ప, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎంజెపి సెట్

ప్రజాశక్తి - గుడిబండ

గుడిబండలో ఉన్న ఎంజెపి కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశం కొరకు నిర్వహించిన సెట్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది.ఈ పరీక్షాకేంద్రానికి 250 మంది విద్యార్థులను కేటాయించగా అందులో 179 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారనికళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - గోరంట్ల

పట్టణంలోని ప్రభుత్వ గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో 2025 – 26 విద్యాసంవత్సరానికి సంబంధించి విద్యాభ్యాసం కొరకు విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ విజయ్ కుమార్ తెలిపారు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మూడవ తరగతికి 40, నాలుగో తరగతికి 32, ఐదో తరగతి 31, ఆరవ తరగతికి 21, ఏడవ తరగతికి 1, ఎనిమిదో తరగతికి 12, 9వ తరగతికి 2 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు ఎస్టీ బాలికలు చేరుటకు అవకాశం ఉందన్నారు ఈనెల 25 వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.